క్లుప్తంగా

బిహార్ కూలీ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మం వైద్యవిభాగం: ఇటీవల తిరుమలాయపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన వలస కూలీ మృతి చెందాడు. అయితే, ఆయన బంధువులు నేపాల్ సరిహద్దులో ఉండటం, అక్కడి నుంచి రాలేమని అశక్తత వ్యక్తం చేయడంతో పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, పోలీస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వితరణలు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మి, శ్రీముద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయం పునర్నిర్మాణానికి పలువురు దాతలు వితరణ చేశారు. మంగళవారం గిరిబోయిన వెంకటనారాయణ దంపతులు, దండెంపల్లి కృష్ణ దంపతులు రూ.5 వేలు చొప్పున వితరణ చేసినట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు.

సన్మానం..

ఖమ్మం మామిళ్లగూడెం: దళితరత్న అవార్డు అందుకున్న మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్‌ను ఖమ్మం ఎంపీ నామానాగేశ్వరావు మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని తెలిపారు. రైతు బంధు సమితి అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరావు, నాయకులు కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రియాదవ్, నరేష్, రామారావు, నాగేశ్వరావు, వెంకయ్య పాల్గొన్నారు.

వాడవాడలా ఎర్ర జెండా ఎగరాలి



మాట్లాడుతున్న నర్సింహారావు

ఖమ్మంమయూరిసెంటర్ : మే డే సందర్భంగా ప్రతీ కార్మికవాడలో ఎర్ర జెండా ఎగురవేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్న నేపథ్యాన... కార్మికులంతా సంఘటితం కావాలని సూచించారు. ఈసమావేశంలో నాయకులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మహ్మద్ జాకీరుద్దీన్, గుండెపొంగు మల్లేష్ పాల్గొన్నారు.

తెలంగాణలో మత రాజకీయాలు చెల్లవు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో మత రాజకీయాలు చెల్లవని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు భద్రూనాయక్, షేక్ నజీమా, రెహమాన్ అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర హోంమంత్రి తాము అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్ రద్దు చేస్తామని ప్రకటించడం బాధ్యత రహితమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపేంద్రనాయక్, బండిరవి, రవీందర్‌నాయక్, రమ్య, వీరన్న నాయక్, కోటేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	విరుపాక్ష
సాయిరాం	కిసీ కా బాయ్ కిసీ కీ జాన్
ఆదిత్య	బలగం
శ్రీనివాస	రావణాసుర
సుందర్	విడుదల

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	44		10
కాకర	46	చుక్కకూర	2
సొరకాయ	16		10
బీర	54	తోటకూర	2
దొండ	18		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	40		15
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

ఇరుకు రోడ్డు.. ఇంకెన్నాళ్లు?

కాగితాలకే పరిమితమైన పల్లెగూడెం-మంగళగూడెం డబుల్ రోడ్డు

- అభ్యంతరాలతో ఆగిపోతున్న వైనం
- పెరిగిన వాహనాల రద్దీ
- రాజకీయ జోక్యంతో అర్ధాంతరంగా ఆగిపోయిన నిధులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


ఇరుకుగా ఉన్న పల్లెగూడెం-మంగళగూడెం సింగిల్ రోడ్డు

ఖమ్మంరూరల్: పెరిగిన వాహనాల రద్దీ ఒకవైపు.. మరో వైపు ఇరుకు రోడ్డుతో ప్రయాణికులు, వాహనదారుల నానా అవస్థలు పడుతున్నారు. ఏదైనా మంచి పని జరగాలంటే అందరూ సహకరిస్తేనే సజావుగా ముందుకు సాగుతుంది. కానీ ఎక్కడికక్కడ పనికి అడ్డు తగిలితే ఇంకా ఆ పని అటకెక్కడం ఖాయం. అచ్చం అదే సరిపోతుంది మండలంలోని పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు డబుల్ రోడ్డు సంగతి. ప్రస్తుతం రోడ్డుపై వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఐదేళ్ల క్రితమే మంజూరు..

గత ఐదేళ్ల క్రితమే ప్రభుత్వం సింగిల్ రోడ్డుగా ఉన్న రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించింది. దీంతో అధికారులు రోడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చు, రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను వివరిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక నిధులు మంజూరే తరువాయి అనుకుంటున్న తరుణంలో కొంతమంది నాయకుల అభ్యంతరాలతో అర్ధాంతరంగా నిధుల మంజూరు ప్రక్రియ ఆగిపోయింది.

సజావుగా సాగని రాకపోకలు..

రోజు రోజుకు వాహనాల రద్దీ పెరిగిపోతుండడంతో రాకపోకలు సజావుగా సాగలేక వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు వెడల్పు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పాటు పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం ఈ రహదారిలో పల్లెగూడెం నుంచి గోళ్లపాడు, తీర్థాల, మంగళగూడెం నుంచి మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని పలు గ్రామాలకు వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఇదే మార్గంలో గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలు ఉండటంతో పెద్ద పెద్ద వాహనాలు కూడా వస్తూ పోతుంటాయి. ఇంకా రూరల్ మండలంలోని మద్దివారిగూడెం, పోలిశెట్టిగూడెం గ్రామాలకు కూడా పలు పనుల నిమిత్తం ఖమ్మం రావాల్సి ఉంటుంది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ బాగా ఉండి ఒక్కోసారి గంటల తరబడి వేచిఉండాల్సి రావడంతో సరైన సమయానికి వాహనదారులు గమ్యాలకు చేరుకోలేకపోతున్నారు. ప్రధానంగా ప్రతి ఏటా తీర్థాలలో నిర్వహించిఏ మహా శివరాత్రి ఉత్సవాలకు ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాల నుంచి దాదాపు లక్షన్నర మంది భక్తులు వస్తుంటారు. ఇక ఆ సమయంలో ఈ రోడ్డుపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగి అటు అధికారుల, ఇటు భక్తుల గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ట్రాఫిక్ క్లియర్ చేయలేక పోలీసులు తంటాలు వర్ణణాతీతం.

రాజకీయ జోక్యమే కారణమా?

నాలుగేళ్ల క్రితమే నిధుల మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణంపై రాజకీయ నీటినీడలు కమ్ముకుంటూనే ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కావాలనే కొంతమంది రాజకీయ నాయకులు రోడ్డు నిర్మాణానికి అడ్డుపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవంగా పల్లెగూడెం, పోలేపల్లి, గోళ్లపాడు, తీర్థాల, మంగళగూడెం గ్రామాల మీదుగా ప్రస్తుతం రోడ్డు ఉన్న పొజిషన్‌లోనే డబుల్ రోడ్డు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. దీనికోసం ఆయా గ్రామాల తరఫున రోడ్డు వెడల్పు వల్ల తమకేమీ అభ్యంతరం ఏమీ లేదని తీర్మానాలు పంపించాల్సి ఉంది. అయితే కొన్ని గ్రామాల్లో ప్రజలు ఎటువంటి అభ్యంతరాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ కావాలనే కొంతమంది రాజకీయ నాయకులు రోడ్డు వెడల్పులో తమ భూములు ఎక్కడ కోల్పోతామోనని మోకాలడ్డుతున్నారని తెలిసింది. దీంతో సంవత్సరాల కొద్ది రోడ్డు మంజూరు ప్రయత్నాలు ముందుకు సాగడంలేదు. ప్రతిపాదనలు పంపి ఏళ్లు గడుస్తున్నప్పటికీ నిధుల మంజూరుకు మాత్రం అతీగతీ లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా రోడ్డు మంజూరుకు పార్టీల నాయకులు ఒకేతాటిపైకి వచ్చి రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

పాలేరు బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా, ఎమ్మెల్యే కందాల


అభివాదం చేస్తున్న ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి తదితరులు

ఖమ్మంరూరల్: తెలంగాణలో అమలవుతున్న పలు అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెదతండాలో గల చల్లపల్లి గార్డెన్స్‌లో జరిగిన పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాల అమలుతో ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే హక్కు, ధైర్యం బీఆర్ఎస్‌కే ఉందని తెలిపారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, పైరవీలకు తాను వ్యతిరేకినని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో పాలేరులో బీఆర్ఎస్‌ను గెలిపించుకొని సీఎంకు బహుమానంగా ఇవ్వాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఈ సభలో జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్, ఎంపీపీ బెల్లం ఉమ, బి. శ్రీను, ఆత్మకమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షుడు బెల్లం వేణు, బ్రహ్మయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల క్రితమే 'కందాల'కు సీటు ఖరారు..

ఎమ్మెల్సీ తాతా మధు

రాష్ట్రంలో పనితీరు బాగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ తిరిగి వచ్చే ఎన్నికల్లో సీట్ ఇస్తామని సీఎం కేసీఆర్ గత ఆరునెలల క్రితమే చెప్పారని ఆ కోవలోనే పాలేరు టికెట్ కందాల ఉపేందర్‌రెడ్డికి ఖరారు అయిందని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని అభివృద్ధి చేసి బూత్‌లెవల్‌లో మెజార్టీ ఓట్లు వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న సీఎం కేసీఆర్‌కు ఇతర రాష్ట్రాల్లోనూ ఎనలేని ఆదరణ వస్తోందన్నారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలి..

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఏళ్ల తరబడి వెనుకబడిన తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న సీఎం కేసీఆర్‌ను తిరిగి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి మూడోసారి సీఎం చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పాలేరుకు ఎవరెవరో వచ్చి మేం పోటీ చేస్తాం అంటున్నారు.. వాళ్లని చూసి కార్యకర్తలెవరూ కంగారు పడొద్దని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలు గెలవడం ఖాయమని చెప్పారు.

షర్మిల అరెస్టును నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి/కామేపల్లి (కారేపల్లి):వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుంపాల కృష్ణమోహన్ ఆధ్వర్యాన ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడమే కాక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మర్రి శ్రీనివాస్, రావుల గంగరాజు, గణపారపు సురేష్, కందిమళ్ల హరీష్, సగ్గుర్తి సుధాకర్, గుండపనేని ఉదయ్, గాజుల వరుణ్, పాషా, వనపర్ల అరుణ, చంద్రకళ, బుల్లి, జానకి రాముడు, గడ్డం కృష్ణ పాల్గొన్నారు. అలాగే, నేలకొండపల్లిలో వైఎస్సార్ టీపీ నాయకుడు సంద్యాల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యాన ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు ధర్మసోత్ రామ్‌నాయక్, సైదులు, గుడవర్తి స్వరూపరాణి, వాలూరి సత్యనారాయణ, చిట్యాల సైదాబాబు, బత్తిని యాలాద్రి, ఆరిఫ్, వీరాంజనేయులు, ఉపేందర్, నరేష్, రవీందర్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు. అదేవిధంగా కామేపల్లి మండలం కొత్తలింగాల క్రాస్ రోడ్డులో పార్టీ మండల అధ్యక్షుడు రడబోతు సత్తిరెడ్డి ఆధ్వర్యాన ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.


ఖమ్మంలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వినతుల పర్వం..

డీఐఈఓకు..

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అడ్మిషన్లు చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉపేందర్, మస్తాన్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం డీఐఈఓ రవిబాబుకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు సాగర్, మణికంఠ, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు..


ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు వెంటనే పింఛన్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల ఎంపీడీఓ జయరాంకు వినతిపత్రం అందజేశారు. అంతేకాక మండలానికి వచ్చే ప్రజలకు పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, జీపీల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నర్సయ్య, పద్మనాభుల సుధాకర్, ప్రసాద్, ఉపేందర్, నిర్మలరావు, వేగినాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు..

ఖమ్మంరూరల్: గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈమేరకు ఎంపీడీఓ అశోక్‌కు సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరికీ జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ పెండింగ్ వేతనాలను చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. విజయ్, వి.పుల్లయ్య, బి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనాలని రాస్తారోకో


నేలకొండపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

నేలకొండపల్లి: తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని రైతులు మంగళవారం బౌద్ధక్షేత్రం రహదారి వద్ద రాస్తారోకో నిర్వహించారు. రహదారుల వెంట రోజుల తరబడి ఆరబెట్టిన ధాన్యాన్ని కాంటాలు వేయకపోవటంతో వర్షాలకు తడిసి మొలకెత్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొని రైతులను ఆదుకోవాలని కోరుతూ.. కోదాడ-ఖమ్మం రహదారిపై ముజ్జుగూడెం, ఆచార్లగూడెం, నేలకొండపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేయటంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి సంబంధిత అధికారులతో మాట్లాడిస్తామని చెప్పటంతో ఆందోళన విరమించారు. రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న అయితగాని శ్రీనివాస్‌గౌడ్

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో బీఎస్పీ ఆధ్వర్యన మే 7న జరిగే తెలంగాణ భరోసా యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మంగళవారం జెడ్పీసెంటర్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దొరల తెలంగాణను సాధించి నరక కూపంలోకి నెట్టివేయబడ్డ బహుజన ప్రజానికానికి మేమున్నాము అనే భరోసా కల్పించడానికి రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన నిర్వహించే ఈసభకు బెహన్ జీ కుమారి మాయావతి వస్తున్నారని, ప్రజలు భారీ ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు దామళ్ల సత్యనారాయణ, మట్టిగురుమూర్తి, బైరు వెంకన్న, గురుమూర్తి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై కమిషనర్ ఆగ్రహం

ఓ ఎస్‌ఐకి షోకాజ్ నోటీస్ జారీ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్సుల జారీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల తీరుపై కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సోమవారం 'ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో చేతివాటం'అను శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ట్రేడ్ లైసెన్సుల జారీలో డబ్బుల వసూళ్లు, క్షేత్రస్థాయి సిబ్బందిపై దురుసు ప్రవర్తన వంటి ఆరోపణలపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ కమిషనర్ ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

పాలేరులో కాంగ్రెస్ విజయానికి కృషి

నేలకొండపల్లి: పాలేరులో కాంగ్రెస్ విజయానికి కోసం ప్రతీ కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. రైతులకు టార్పాలిన్‌లు అందించడంతో పాటు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగ నిరసన ర్యాలీ విజయవంతానికి పాటుపడినట్లే ప్రభుత్వంపై ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో నాయకులు యడవల్లి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, యాతాకుల శ్రీనాథ్ పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో సాంకేతిక శిక్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని కళాశాలలో మంగళవారం టాస్క్ ఫ్రంట్ అండ్ టెక్నాలజీపై విద్యార్థినులకు సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంకేతిక నిపుణుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మారుతున్న టెక్నాలజీపై అవగాహన పెంచుకొని జ్ఞానంతో పాటు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. కళాశాల చైర్మన్ కె.నవీన్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాకరవాయిలో ఇంటింటికీ టీడీపీ

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి గ్రామంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్, నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు నామ ప్రసాద్‌లు పాల్గొని గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే చొరవతో సదరమ్ క్యాంపు

కూసుమంచి: దివ్యాంగుల కోరిక మేరకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి చొరవతో మంగళవారం కూసుమంచిలో సదరమ్ క్యాంపు నిర్వహించారు. పాలేరు నియోజకవర్గంలోని పలువురు దివ్యాంగులు ఈ క్యాంపులో పాల్గొనగా.. వారిని వైద్యులు పరీక్షించారు. ఈక్రమంలో క్యాంపును ఎమ్మెల్యే కందాల సందర్శించి దివ్యాంగులతో మాట్లాడారు. వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్, ఆత్మా కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కూసుమంచి: చేగొమ్మ సహకార సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సంఘం చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, సర్పంచ్ కొండా సత్యం, ఎంపీటీసీ ఊడుగు జ్యోతి, అంబాల ఉమ, ఏఈఓ కిరణ్మయి, సీఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 51వ డివిజన్‌లో గల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం మంగళవారం ప్రారంభించారు. డివిజన్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ఆర్పీలు, ఆశాలు శిబిరం ఏర్పాటుపై స్థానికులకు సమాచారం ఇవ్వాలన్నారు. మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పండగలా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు


భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాలు, ప్రధాన కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీ జెండాను ఎగురవేసి స్వీట్లు పంచారు. అనంతరం ర్యాలీలు నిర్వహించి ఆత్మీయ సమ్మేళనాలకు తరలివెళ్లారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంఅర్బన్: ఆత్మీయ సమ్మేళనానికి ప్రదర్శనగా వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


కామేపల్లి మండలం పండితాపురంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న నాయకులు


కూసుమంచి: పాలేరులో పతాకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి



అటెన్షన్ ప్లీజ్

యథేచ్ఛగా పార్కింగ్..!

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయాల్సి వస్తోంది. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది తమ ద్విచక్ర వాహనాలను ఆస్పత్రి లోపలికే తీసుకొచ్చి యథేచ్ఛగా ఇలా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఎంసీహెచ్ భవనానికి వచ్చే రోగులకు కుర్చోవడానికే స్థలం సరిపోక ఇబ్బందులు పడుతుండగా.. సిబ్బంది ఏకంగా ఇలా పార్క్ చేయటం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమనే చెప్పాలి. ఇకనైనా అధికారులు చొరవ తీసుకోని పార్కింగ్ సౌకర్యం కల్పించాలి.

- ఖమ్మం వైద్యవిభాగం

